క్లుప్తంగా

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఇబ్రహీంపట్నం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సకాలంలో ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని కోరిన యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా నాయకులకు ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న విధానపరమైన చర్యలను మంత్రి వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య అధ్యక్షతన వేతనాలపై మంత్రికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్ స్టార్, ఆర్మ్‌స్ట్రాంగ్, కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహ వేడుకలు



మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో సప్తాహ వేడుకలు మూడో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు, అర్చకబృందం గణపతి పూజతో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. 108 కలశబిందెల జలం, పంచామృతాలతో స్వామికి అభిషేకం చేశారు. కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, మేనేజర్ వెంకటేశ్వరరావు, పాలకవర్గం సభ్యుల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. శనివారం ముక్కోటి ఏకదాశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయని మేనేజర్ తెలిపారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి



ఆగిరిపల్లి: ఏసుక్రీస్తు ప్రేమ, దయ గుణాలు అందరికీ మార్గదర్శకమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని సగ్గూరులో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ యూత్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతర్లంక లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లీడ్ క్యాప్ డైరెక్టర్ డాక్టర్ కోనేరు సత్యప్రియ, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైస్ ఎంపీపీ రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారావు, నెక్కలం ఐసీఎం చర్చి బోధకులు పాల్ రాజ్ పాల్గొన్నారు.

సమానత్వమే క్రీస్తు బోధనల సారాంశం

ముసునూరు: ప్రేమ, శాంతి మార్గాలే క్రీస్తు బోధనల సారాంశమని హెచ్ఎం తూమాటి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురం పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం విజయలక్ష్మి, బాబూరావు దంపతులు వృద్ధులు, వితంతు మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు.

చాట్రాయిలో.

చాట్రాయి: మండలంలోని చనుబండ ఆర్సీఎం చర్చిలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఫాదర్ రెవ.నరేష్ దైవ సందేశాన్ని వివరించారు. 60 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్లు డాన్‌బాస్కో, కిరణ్ పాల్గొన్నారు.

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్



రెడ్డిగూడెంలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మైలవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు



తిరువూరు శ్రీనిధి స్కూల్లో రామానుజన్ జయంతి



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతిప్రదానం



నూజివీడులో ప్రదర్శనను పరిశీలిస్తున్న టీచర్లు



కొండపల్లి క్రాంతి హైస్కూల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

తిరువూరు: గణిత శాస్త్రంలో అపార మేధోసంపత్తి కలిగిన శ్రీనివాస రామానుజన్ చిన్న వయసులోనే అద్భుత ప్రయోగాలు చేశారని తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పీఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తిరువూరు శ్రీనిధి, నాగార్జున స్కూళ్లలో కూడా రామానుజన్ జయంతి నిర్వహించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: విద్యార్థులకు భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జీవితం ఆదర్శప్రాయమని హెచ్ఎం జి.అనుగ్రహప్రసాద్ అన్నారు. రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విజయబాబు కాలనీలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయురాలు నాగమణి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో గణితశాస్త్రానికి ప్రాధాన్యం

మైలవరం: ఇంజినీరింగ్‌లో గణితశాస్త్రానికి విశిష్టమైన ప్రాధాన్యం ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. భారత ప్రభుత్వం డిసెంబర్ 22న ప్రతి సంవత్సరం జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించిన సందర్భంగా శుక్రవారం మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. అలాగే ఈ ఏడాది జేఎన్టీయూ కాకినాడు వారు ఈ నెల 18 నుంచి 23 వరకు మ్యాథమెటిక్స్ వీక్‌గా ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఫ్రెషమెన్ ఇంజనీరింగ్ విభాగం మ్యాథమెటిక్స్ అధ్యాపకులు సంయుక్తంగా విద్యార్థులకు గణిత సంబంధిత పోటీలను నిర్వహించారు. ఫ్రెషమెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివహరిప్రసాద్ పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో శుక్రవారం గణిత శాస్త్రవేత్త రామనుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఇన్‌చార్జి హెచ్ఎం వీణారాణి రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ముసునూరులో..

ముసునూరు: ప్రతి మనిషి నిత్య జీవితంలో గణితం ముఖ్య పాత్ర పోషిస్తుందని హెచ్ఎం సునీల అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముసునూరు హైస్కూల్లో హెచ్ఎం అధ్యక్షతన రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయులు రత్నమాల, నాగేశ్వరరావు, చిట్టిబాబు, వెంకటేశ్వరరావులను సన్మానించారు. విద్యార్థులు వృత్తం, చతురస్రం, త్రిభుజం ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు.

లక్ష్మీపురంలో..

తిరువూరురూరల్: తిరువూరు మండలంలోని కోకిలంపాడు, మల్లేల, మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలు, లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలు కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో శుక్రవారం జరిగాయి. మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్ ప్రారంభించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

గణితాన్ని ఇష్టపడి చదవాలి

నూజివీడు: విద్యార్థులు గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలని విజయవాడలోని ఎస్ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు టి.ఆర్యపతి అన్నారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, డీన్ అకడమిక్స్ లక్ష్మణరావు, హెచ్ఓడీ వి.రాము పాల్గొన్నారు.



తిరువూరు మండలం లక్ష్మీపురంలో రామానుజన్ జయంతి



నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో గణిత శాస్త్ర దినోత్సవం



ముసునూరులో గణిత గుర్తుల ఆకృతిలో విద్యార్థులు

ముక్కోటి ఉత్సవాలకు ఏర్పాట్లు



తిరువూరు కోదండ రామాలయానికి భూచక్ర గొడుగు వితరణ

తిరువూరు: ముక్కోటి ఏకాదశి పర్వ దిన సందర్భంగా శనివారం భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకోడానికి తిరువూరులోని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. శ్రీవేంకటాచలస్వామి దేవస్థానం, శ్రీకోదండరామాలయం, శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి దేవస్థానాల్లో భక్తులు స్వామి దర్శనం చేసుకోడానికి క్యూలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసాదం కౌంటర్లు సిద్ధం చేశారు. కోదండ రామాలయంలో స్వామివారి అలంకరణకు అనుమోలు సుధాకరరావు కుటుంబసభ్యులు భూచక్ర గొడుగు అందజేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గంపలగూడెం మండలంలో పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశారు. నెమలి వేణుగోపాలస్వామి ఆలయం, గంపలగూడెం, పెనుగొలను రామాలయాల్లో, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయాల్లో శనివారం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు.

బాలిరెడ్డి ఆలోచనా విధానం అద్భుతం



సదస్సులో పాల్గొన్న అతిథులు, కళాశాల చైర్మన్ ప్రసాదరెడ్డి, ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి ఆలోచనా విధానం ఈ ప్రాంతానికి ప్రాణం పోసిందని న్యూఢిల్లీ ఏఐసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీఐఎస్ఎస్–2023 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి లకిరెడ్డి బాలిరెడ్డి చేసిన కృషి తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఇంజినీర్లుగా తీర్చిదిద్దారన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఆలోచనా విధానం కలిగి ఉండాలన్నారు. యూనివర్శిటీ ఆఫ్ బఫెల్లో, అమెరికా వైస్ ప్రసిడెంట్, రీసెర్చ్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ వేణుగోవిందరాజులు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ ప్రాధాన్యతను వివరించారు. ఆస్ట్రేలియా టీసీఎస్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ సైబర్ రిసీలియన్స్ ప్రాధాన్యం వివరించారు. సదస్సులో ప్రొఫెసర్ ప్రదీప్ కే దాస్, డాక్టర్ వై.విజయలత, డాక్టర్ ఈ శ్రీనివాసరెడ్డి, లకిరెడ్డి ప్రసాదరెడ్డి, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. ఆహ్వానితులకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బత్తులవారిగూడెంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు మందాడ శంకరరావు, మందాడ స్వామి నేతృత్వంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో 20 కిలోల కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, ఎంపీపీ శిరీష, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రాధాన్యం



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కోటమ్మ, హెచ్ఎం శ్రీనివాసరావు

పొందుగల(మైలవరం): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని పొందుగల సర్పంచ్ గుగులోతు కోటమ్మ తెలిపారు. మైలవరం మండలం పొందుగల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వైఎస్సార్ ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అయ్యప్ప స్వామి టెంపుల్ అండ్ 11 కేవీ వాసవి ఫార్మా ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్, వస్తలత కాలనీ, ఎస్ఎస్ఎస్ కాలనీ, మధుసూదన టింబర్ డిపో, హరి ఓం టింబర్ డిపో ఏరియా వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు తిరుపతమ్మ ఆలయంలో షాపుల వేలం

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్యస్వామి దేవస్థానంలో వంట సామాను, ఫ్యాన్సీ షాపులు నిర్వహించుకునేందుకు షాపులు వేలం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సాంబశివరావు శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై సమావేశం

విస్సన్నపేట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై మండలంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సురేష్, పీడీ రమేష్ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల పంచాయతీ కోటిపల్లి, నడింపుట్రేలలో ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఏఎస్ఓ దయానంద్ శుక్రవారం నిర్వహించారు. అన్ని పోలింగ్‌బూత్‌ల వద్ద ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

29న తలనీలాల హక్కునకు బహిరంగ వేలం

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కునకు ఈ నెల 29వ తేదీన టెండర్ కం బహిరంగ వేలం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్‌కుమార్, ఈఓ సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఆసక్తిగల వారు 27న సాయంత్రం ఐదు గంటలలోపు దేవస్థానం కార్యాలయం నందు సంప్రదించాలన్నారు.

ప్రోత్సాహం

తిరువూరురూరల్: పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. తిరువూరు మండలం రోలుపడి, సూరవరం గ్రామాల్లో పాల ఉత్పత్తిదారులకు శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

మైలవరం: ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, దేశాన్ని రక్షించండి అంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్ పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో దాడి ప్రజలకు చూపించి సానుభూతి ఓట్లు పొందాలనేది బీజేపీ కుటిల ప్రయత్నం అని, ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచే సత్తా లేక ప్రతి సారి ఇలాగే ఎన్నికల సమయంలో ఏదోరకంగా జిత్తులమారి ప్రయత్నాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బీజేపీ కుటిల ప్రయత్నానికి నరసన వ్యక్తం చేస్తూ మైలవరంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నూజివీడు రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు.

నేడు 3కే రన్

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో 3కే రన్ నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమయ్యే 3కే రన్ విజయవాడ రోడ్డులోని రాజీవ్ సర్కిల్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ రన్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని 15 సంవత్సరాలు పైబడిన యువత రన్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు వేర్వేరుగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

రెడ్డిగూడెం: మండలంలోని రాఘవాపురంలో ఆలవాల వెంకటేశ్వరరెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ సమస్యలపై డాక్టర్ పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ శిబిరంలో 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు, బోర్డు డైరెక్టర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

షాబూఖారీ దర్గాలో అయ్యప్పల పూజ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ప్రసిద్ధిగాంచిన షాబూఖారీ దర్గాను వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలాధారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా షాబూఖారీ బాబాను దర్శించుకుని చాదర్ సమర్పించారు. మతగురువు మహ్మద్ అల్తాఫ్‌రజా ప్రత్యేక ప్రార్థన జరిపారు. అయ్యప్ప మాలాధారుల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరాలని ప్రార్థించారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చాట్రాయి: మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో శనివారం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ బ్రహ్మచారి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పశు వైద్యశిబిరం

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెంలో శుక్రవారం గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో ఏలూరు సేవా సంస్థ సహకారంతో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వరావు, సేవా సంస్థ కార్యదర్శి రాజారావు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

ఏ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడులో దళితవాడకు చెందిన దళితులకు శ్మశాన వాటికకు స్థలం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన సొంత ఎకరం భూమిని దళితుల అవసరం నిమిత్తం శ్మశాన వాటికకు కేటాయించారు. దీంతో సుమారు వెయ్యి కుటుంబాల సమస్యల పరిష్కారమైందని స్థలదాత తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి ఆదేశాల మేరకు వెంకటేశ్వరరెడ్డి భూమిని కేటాయించారు. ఈ భూమిని తహసిల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు పరిశీలించారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం

విస్సన్నపేట: విస్సన్నపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం–2, 4 భవనాలను ఎమ్మెల్యే కె.రక్షణనిధి శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి డీపీవీ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో అవసరమైన తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటి శుద్ధి యంత్రంలో రెండు లీటర్లకు ఒక లీటర్ స్వచ్ఛమైన తాగునీరు వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ మన్మోహన్, డిప్యూటీ కార్యదర్శి సుశీల పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు బీపీ మిషన్లు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధి సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు క్యాపో సొసైటీ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ బీపీ మిషన్లు శుక్రవారం అందజేశారు. సచివాలయం ఏఎన్ఎంల వద్ద బీపీ మిషన్ల కొరత ఉందని దయాసాగర్‌ను కోరగా తక్షణమే స్పందించిన ఆయన ఎలక్ట్రానిక్ బీపీ మిషన్లు సమకూర్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకుని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ విజయకుమార్ చేతుల మీదుగా మిషన్లు అందజేశారు. దాతల సహకారం సద్వినియోగం చేసుకుని ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపర్చాలని డాక్టర్ విజయకుమార్ కోరారు.

ఘనంగా నిమ్రా కళాశాల ఫౌండర్స్ డే

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా విద్యా సంస్థల వ్యవస్థాపకులు మహ్మద్ విజారత్ రసూల్ ఖాన్ జయంతి సందర్భంగా ఫౌండర్స్ డే వేడుకలు శుక్రవారం నిర్వహించి కేక్ కట్‌చేశారు. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి మాట్లాడుతూ పేదలకు సైతం ఉన్నత విద్య, వైద్యం అందాలనే తలంపుతో పలు ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు, వైద్యశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఏడాది విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

ఆలయం ముస్తాబు

ఆగిరిపల్లి: శోభనగిరిపై వేంచేసి యున్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని భక్తుల ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయం ముస్తాబైంది. వేకువ జామున మూడు గంటలకు స్వామికి అభిషేకాలు ధనుర్మాస నిత్య అర్చనలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వేదాంతం శేషబాబు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'కు ఏర్పాట్లు

నూజివీడు: ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరానికి మండలంలోని పలు హైస్కూళ్లలో ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నారు. యువతీ యువకులకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తారు. పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతిని ప్రభుత్వం అందజేయనుంది.